క్లుప్తంగా

మహిళలకు ఉచిత శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్ : కెనరా బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంత మహిళలకు టైలరింగ్, బ్యూటీ పార్లర్ మేనేజ్‌మెంట్‌లలో 30 రోజులపాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ డైరెక్టర్ నారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలపారు. మార్చి 4వ తేదీ నుంచి ప్రారంభమయ్యే ఈ శిక్షణకు 18 నుంచి 45 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఉండాలన్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే వారికి ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పిస్తారన్నారు. ఆసక్తిగల మహిళలు శిక్షణ కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 94409 05478, 99856 06866 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని ఏపీ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర డిప్యూటీ సెక్రటరీ ఉద్దె మద్దిలేటి అన్నారు. మంగళవారం నగరంలోని హోచిమన్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 1996వ సంవత్సరంలో భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయగా ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం 2009 సంవత్సరంలో మన దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి కార్మికులను ఆదుకున్నారన్నారు. పెండింగ్‌లో కార్మికుల క్లెయిమ్‌లను వెంటనే క్లియర్ చేయాలన్నారు. సమస్యలపై 29న కడప కలెక్టరేట్ దగ్గర జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని భవన నిర్మాణ కార్మికులకు వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి లింగన్న, జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

'స్వామినాథన్' రిపోర్టును అమలు చేయాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం స్వామినాథన్ కమిటీ సిఫార్సులను అమలు చేయాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండి జకరయ్య పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని ఇందిరా భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త స్వామినాథన్ రైతుల పెట్టుబడి, దిగుబడి ఖర్చులు, ప్రకృతి వైపరీత్యాలు, మద్దతు ధర, గిట్టుబాటు ధర, రైతు శ్రమ తదితర రైతాంగ సమస్యలపై స్వామినాథన్ అధ్యాయనం చేసి రిపోర్ట్‌ను కేంద్ర ప్రభుత్వానికి ఇచ్చారన్నారు. స్వామినాథన్ కమిటీ రిపోర్టును అమలు చేయాలని వివిధ రాజకీయ పార్టీలు, రైతు సంఘాలు డిమాండ్ చేస్తూ 2018 నుంచి ఆందోళన చేస్తున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పట్టించుకోకుండా కర్కశంగా వారిపై పోలీసులతో అణచివేయాలని చూడటం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు విష్ణుప్రీతం రెడ్డి, ప్రసాద్ పాల్గొన్నారు.

29న జాబ్ మేళా

ప్రొద్దుటూరు : మండలంలోని హౌసింగ్ బోర్డులో ఉన్న మండల సమాఖ్య కార్యాలయంలో ఈ నెల 29న ఉదయం 10 గంటలకు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఏసీ లావణ్య, ఏపీఎం సుబ్బమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. డి మార్ట్‌లో 45 పిక్కర్స్, ప్యాకర్స్, క్యాషియర్ ఉద్యోగాలకు టెన్త్, ఇంటర్, డిగ్రీ చదివి 18–25 ఏళ్లలోపు ఉన్న వారు అర్హులని వివరించారు. మరిన్ని వివరాలకు సెల్ నంబర్ 900040132 సంప్రదించాలని కోరారు.

రక్తదానానికి యువత ముందుకు రావాలి

మైదుకూరు : రక్తదానం చేసేందుకు యువత ముందుకు రావాలని మైదుకూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ కరీముల్లా, స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి.నారాయణరెడ్డి కోరారు. కళాశాలలో మంగళవారం రెడ్ రిబ్బన్ క్లబ్, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు రక్తదానం చేయగా, వారికి ప్రిన్సిపాల్ నారాయణరెడ్డి, వైద్యాధికారి డాక్టర్ కరీముల్లా సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ కృష్ణారెడ్డి, రెడ్ రిబ్బన్ క్లబ్ కోఆర్డినేటర్ అయ్యవారు రెడ్డి, ఐసీటీసీ కౌన్సిలర్ ప్రసాద్, టెక్నీషియన్ బాషా, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

సీహెచ్‌సీ తనిఖీ

సిద్దవటం : సిద్దవటం కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ)ను అధికారులు మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా టీమ్ ఆఫ్ స్టేట్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ సునీల్‌కుమార్ నాయక్, కన్సల్‌టెంట్ (సీహెచ్ఐ) డాక్టర్ విజయ్‌కుమార్ ఆసుపత్రిని పరిశీలించారు. ఆసుపత్రిలో అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. రోగులకు అందుతున్న సేవలపై వారు సంతృప్తి చెందారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సాయి జోత్స్న, మత్తు డాక్టర్ శివాణి, జనరల్ సర్జన్ డాక్టర్ సూర్యచంద్ర, ఫిజియోథెపిస్ట్ డాక్టర్ ప్రకాష్, డాక్టర్ కె. రమ్య (డెంటల్), డాక్టర్ మురళి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

16న లోక్ అదాలత్

కమలాపురం: మార్చి 9న జరగాల్సిన జాతీయ లోక్ అదాలత్ ఈ నెల 16వ తేదీకి వాయిదా వేసినట్లు కమలాపురం జూనియర్ సివిల్ కోర్టు మేజిస్ట్రేట్ ఎస్.లావణ్య మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మహా శివరాత్రి కారణంగా కోర్టు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు మెజిస్ట్రేట్ అందులో పేర్కొన్నారు. కక్షిదారులు ఈ విషయాన్ని గమనించాలని తెలియజేశారు.

సమాజంలో సేవా సంస్థల పాత్ర ప్రశంసనీయం

- యువత స్వచ్ఛంద సేవా కార్యక్రమాల్లో ముందుండాలి
- ఘనంగా ప్రపంచ ఎన్జీఓ దినోత్సవం



పోటీల్లో గెలుపొందిన విద్యార్థులతో నిర్వాహకులు



స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులతో స్టెప్ సీఈఓ సాయి గ్రేస్, అధికారులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : సమాజంలో నిరక్షరాస్యత, పేదరికం, ఆకలి కొరతను నిర్మూలించడంలో సేవా సంస్థలు పోషిస్తున్న పాత్ర ప్రశంసనీయమని ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్‌వీ సుదర్శన రెడ్డి తెలిపారు. జేబీవీఎస్ ది ప్రెసెర్వెర్ సేవా సంస్థ, సమరిటన్ చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో కడప నగరంలోని ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాలలో వరల్డ్ ఎన్జీఓ డే సందర్భంగా వ్యాస రచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ సేవా సంస్థల తోడ్పాటుతో అనాథలు, పేదల అవసరాలు తీరుతాయన్నారు. ఇందుకుగాను దాతలు వారికి సహాయ సహకారాలు అందించాలని సూచించారు. జేబీవీఎస్ ది ప్రిజర్వర్ సేవా సంస్థ వ్యవస్థాపకులు అశోక్ మాట్లాడుతూ ఎన్జీఓను అందరి సహకారంతోనే నడపగలమని తెలియజేశారు. ఎన్జీఓ స్థాపనలో యువత పాల్గొని ప్రజాసేవ కార్యక్రమాలను పెద్దఎత్తున నిర్వహించాలన్నారు. సమరిటన్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు భరత్ మాట్లాడుతూ చాలా మంది డబ్బు ఉంటేనే సేవా కార్యక్రమాలు చేయవచ్చు అని భ్రమ పడుతుంటారని, డబ్బు లేకుండా చేసే సేవా కార్యక్రమాలు ఎన్నో ఉన్నాయని తెలిపారు. వరల్డ్ ఎన్జీఓ డే సందర్భంగా వ్యాస రచన, వక్తృత్వ పోటీల్లో నిర్వహించి గెలుపొందిన విజేతలకు అతిథులు బహుమతులు అందించారు. కార్యక్రమంలో జేబీవీఎస్ సంస్థ ఎగ్జిక్యూటివ్ మెంబర్ అయేషా, ఎన్ఎస్ఎస్ పీఓలు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, ఆయా సంస్థల సభ్యులు సిరి, కార్తిక్, సాహెబ్, శ్రీకాంత్, ఉస్మాన్, మహిమ, సాల్మన్, యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రేమాలయంలో స్టెప్ సీఈఓ ఆధ్వర్యంలో..

సమాజానికి స్వచ్ఛంద సేవా సంస్థలు అందిస్తున్న సేవలు ప్రశంసనీయం స్టెప్ సీఈఓ సాయి గ్రేస్ తెలిపారు. మంగళవారం కడప నగరంలోని ప్రేమాలయ నిరాశ్రాయుల వసతిగృహంలో వరల్డ్ ఎన్జీఓ డే వేడుకలు మీకోసం సేవా సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పాల్గొన్న స్టెప్ సీఈఓ మాట్లాడుతూ స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు తమతమ పనులు వదులుకుని అనాథలు, పేదలను ఆదుకోవడం ప్రశంసనీయమన్నారు. అనంతరం నగరంలో సేవలు చేస్తున్న 30 మంది ఎన్జీఓలను మెమెంటో, షీల్డ్‌తో ఆమె ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో స్టెప్ సిబ్బందితోపాటు మీకోసం సేవా సంస్థ అధ్యక్షుడు విష్ణువర్దన్, నిరాశ్రయుల వసతి గృహం మేనేజర్ శ్రీనివాసులురెడ్డి, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

నేమ్ బోర్డులు ఉర్దూలోనూ ఉండాలి



ఆర్టీసీ చైర్మన్‌కు వినతిపత్రం ఇస్తున్న రూటా నేతలు

కడప ఎడ్యుకేషన్: రాష్ట్రంలో 80 లక్షల మంది ఉర్దూ మాతృభాషను కలిగి ఉన్నారని వారందరిని దృష్టిలో ఉంచుకుని ఏపీఎస్ ఆర్టీసీ బస్సులన్నింటి పైన ఉర్దూ భాషలో నేమ్ బోర్డులను రాయించాలని రూటా నాయకులు కోరారు. ఈ విషయమై మంగళవారం రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర సమన్వయ కర్త మహమ్మద్ ఆయూబ్, రాష్ట్ర ఉర్దూ లెక్చరర్స్ వింగ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వసీవుల్లా బక్తీయారి సాహెబ్‌లు కడప కార్యాలయంలో చైర్‌పర్సన్ మల్లికార్జునరెడ్డిని కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో 80 లక్షల మంది ఉర్దూ మాతృభాషను కలిగి ఉండటంతోపాటు లక్షల సంఖ్యలో విద్యార్థులు ఉన్నారన్నారు. వారందరి కోసం ఆర్టీసీ బస్సులపై ఉర్దూభాషలో పేర్లను రాయించాలని కోరారు. కార్యక్రమంలో రూటా జిల్లా ప్రధాన కార్యదర్శి జాకీర్ హుస్సేన్, రాష్ట్ర కన్వీనర్ షాబుద్దీన్ షేక్, నగర కార్యదర్శి హిఫాజతుల్లా తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ పనులు వేగంగా పూర్తిచేయాలి



డ్రైనేజీ పనులపై అధికారులతో మాట్లాడుతున్న నగరపాలక కమిషనర్ ప్రవీణ్‌చంద్

కడప కార్పొరేషన్ : నగరంలో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలని నగరపాలక కమిషనర్ జీఎస్ఎస్ ప్రవీణ్‌చంద్ తెలిపారు. మంగళవారం మార్నింగ్ విజిట్‌లో భాగంగా నగరంలోని పలు ప్రాంతాల్లో జరుగుతున్న డ్రైనేజీ నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. అంబేడ్కర్ సర్కిల్ నుంచి వై జంక్షన్ సర్కిల్ వరకు జరుగుతున్న పనులలో స్ట్రీట్ డ్రైనేజీలను మెయిన్ డ్రైనేజీలలో కలిపే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పనులు పూర్తయ్యాక రోడ్డు సేఫ్టీ మార్కింగ్ ఇవ్వాలని ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులను ఆదేశించారు. నగరంలోని అన్ని వీధి దీపాల సమయం ఒకేలా ఉండేలా చూసుకోవాలన్నారు. అన్నమయ్య జంక్షన్ వద్ద డ్రైనేజీపై మాన్ హోల్స్‌ను, సర్కిల్ వద్ద ప్లాంటేషన్, రంగురంగుల దీపాలను ఏర్పాటు చేయాలన్నారు. క్రిష్ణదేవరాయ సర్కిల్‌లో జరుగుతున్న పనులను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. మాసాపేట నుంచి మార్కెట్ యార్డ్ వరకు, అలానే అల్మాస్‌పేట కూడలి వద్ద చేస్తున్న డ్రైనేజీ పనులు వేగవంతంగా పూర్తి చేసి డివైడర్ పనులను ప్రారంభించాలన్నారు. కార్యక్రమంలో ఏసీపీ నాగేంద్ర, నగరపాలక ఇంజినీరింగ్ అధికారులు, ఆర్‌అండ్‌బీ అధికారులు పాల్గొన్నారు.

'మా సంఘం ఏ పార్టీకి అనుబంధం కాదు'

మైదుకూరు : తాము ఏర్పాటు చేసుకున్న సంక్షేమ సంఘం ఏ పార్టీకి అనుబంధం కాదని మైదుకూరుకు చెందిన నూర్ బాషా దూదేకుల సంఘం నాయకులు తెలిపారు. మంగళవారం మైదుకూరులో వారు విలేకరులతో మాట్లాడుతూ కొద్ది రోజుల కిందట తాము నూర్ బాషా దూదేకుల సంక్షేమ సంఘాన్ని ఏర్పాటు చేసుకోగా, అది ఒక రాజకీయ పార్టీకి అనుబంధమని కొందరు సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేయడం శోచనీయమన్నారు. దూదేకుల సమస్యల పరిష్కారం కోసం, అభివృద్ధి కోసం మాత్రమే తాము సంఘం ఏర్పాటు చేసుకున్నట్లు సంఘం అధ్యక్షుడు పి.మునెయ్య, ఉపాధ్యక్షుడు జి.మస్తాన్, కోశాధికారి కె.బాలన్న, కార్యవర్గ భ్యులు స్పష్టం చేశారు. తమ సంఘం ఏ రాజకీయ పార్టీకి మద్దతు తెలపలేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు పాల్గొన్నారు.

'మేము సిద్ధం' సమావేశంలో జిల్లా నేతలు



కార్యక్రమానికి హాజరైన వైఎస్సార్‌సీపీ జిల్లా నేతలు

కడప కార్పొరేషన్ : విజయవాడ మంగళగిరిలోని సీకే కన్వెన్షన్ సెంటర్‌లో మంగళవారం 'మేము సిద్ధం – మా బూత్ సిద్ధం' పేరుతో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఎమ్మెల్యేలు, సమన్వయకర్తలకు నిర్వహించిన కార్యక్రమానికి పలువురు జిల్లా నేతలు హాజరయ్యారు. వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఆ పార్టీ కడప, రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గాల రీజనల్ కో ఆర్డినేటర్ కె.సురేష్ బాబు, ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా, రైల్వేకోడూరు ఎమ్మెల్యే కొరుముట్ల శ్రీనివాసులు, రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డిలు హాజరయ్యారు. అలాగే వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షులు గుమ్మా రాజేంద్రప్రసాద్‌రెడ్డి, ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ పులి సునీల్‌కుమార్, క్లస్టర్ పార్టీ అధ్యక్షులు పి.జయచంద్రారెడ్డి, తోటక్రిష్ణ, సుభాన్ బాషా, హరూన్ బాబు, జేసీఎస్ కన్వీనర్లు పాకా సురేష్, రెడ్డి ప్రసాద్, షఫీ, మల్లికార్జున, రామలక్ష్మణ్‌రెడ్డి, అహ్మద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

పల్స్ పోలియోను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న డాక్టర్ ఉబేదుల్లా

కడప రూరల్ : వైద్య సిబ్బంది పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని స్థానిక అక్కాయపల్లె డాక్టర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఉబేదుల్లా అన్నారు. మంగళవారం స్థానిక ఆసుపత్రిలో ఆశ, అంగన్‌వాడీలు, వలంటీర్‌లకు మార్చి 3వ తేదీన నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమం సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డా.ఉబేదుల్లా మాట్లాడుతూ ఐదేళ్లలోపు వయసు కలిగిన చిన్నారులకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలన్నారు. పోలియో చుక్కలు వేసే కార్యక్రమాన్ని 100 శాతం పూర్తి చేయాలన్నారు. పోలియో రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ వెంకటసుబ్బమ్మ, సూపర్‌వైజర్ మహబూబ్‌బాషా, మాధవి లత, లక్ష్మి కుమారి తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దు చేసే వారికే మద్దతు

ప్రొద్దుటూరు కల్చరల్ : సీపీఎస్ రద్దు చేసే పార్టీకే ఉద్యోగ, ఉపాధ్యాయుల మద్దతు ఉంటుందని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి డీవీ రవీంద్రుడు తెలిపారు. మంగళవారం స్థానిక హోమస్ పేటలోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో ఓట్ ఫర్ ఓపీఎస్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఓపీఎస్ అమలు చేయకుండా జీపీఎస్ అమలు చేయడం దారుణమన్నారు. వచ్చే ఎన్నికల్లో ఓపీఎస్ అమలు చేసే పార్టీలకే తమ మద్దతు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో నాగరాజు, మోహన్ కుమార్, సరళాదేవి, పార్వతి, లక్ష్మీదేవి, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రాన్ని తిరిగి ఏర్పాటు చేయండి



డీఈఓకు వినతిపత్రం ఇస్తున్న ఎస్టీయూ నాయకులు

కడప ఎడ్యుకేషన్: వైఎస్సార్ జిల్లా సీకే దిన్నె మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో ఎస్ఎస్‌సీ పరీక్ష కేంద్రాన్ని తిరిగి ఏర్పాటు చేయాలని ఎస్టీయూ నాయకులు కోరారు. ఈ విషయమై మంగళవారం డీఈఓ మర్రెడ్డి అనురాధను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దశాబ్దాలుగా సికెదిన్నె మండల కేంద్రంలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో ఎస్ఎస్‌సీ పరీక్షా కేంద్రం కొనసాగుతూ వస్తోందన్నారు. ఇప్పుడు పరీక్షా కేంద్రాన్ని ఓ కార్పొరేట్ పాఠశాలలో ఏర్పాటు చేయడాన్ని తప్పుబట్టారు. సౌకర్యాలు సరిగ్గా లేవన్న సాకు పరీక్షా కేంద్రాన్ని తీసేయడం అన్యాయమని చెప్పారు. పాఠశాలలో నాడు-నేడు కింద సౌకర్యాలు కల్పించరాని తెలియజేశారు. తిరిగి పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేసి విద్యార్థులు పరీక్షలకు దూర ప్రాంతాలకు ప్రయాణించకుండా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. అలానే పరీక్షా కేంద్రం రద్దు అయ్యే విధంగా వ్యవహరించిన మండల విద్యాధికారులు, సిబ్బందిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డీఈఓకు విజ్ఞప్తి చేశారు. అనంతరం ఈ మేరకు వినతిపత్రాన్ని డీఈఓకు అందజేశారు. కార్యక్రమంలో ఎస్టీయూ స్టేట్ అసోసియేట్ సురేష్‌బాబు, రాష్ట్ర ఉపాధ్యక్షులు బాలగంగిరెడ్డి, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఇలియాష్‌బాషా, జిల్లా ప్రధాన కార్యదర్శి సంగమేశ్వరరెడ్డి, జిల్లా నాయకులు సుదర్శన్‌రెడ్డి, జగన్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

హమాలీలకు ఎగుమతి రేట్లను పెంచాలి



ఐఎంఎల్ డిపో వద్ద ధర్నా చేస్తున్న హమాలీలు

కడప వైఎస్ఆర్ సర్కిల్: రాష్ట్రవ్యాప్తంగా ఐఎంఎల్ డిపోలో పనిచేస్తున్న బేవరేజ్ హమాలీ కార్మికులకు ఎగుమతి రేట్లను పెంచాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ పేర్కొన్నారు. మంగళవారం ఐఎంఎల్ డిపోలో పని చేస్తున్న హమాలీలకు ఎగుమతి రేట్లను పెంచాలని కోరుతూ నగర శివార్లలోని ఐఎంఎల్ డిపో వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం ఆదాయంలో ఎక్సైజ్ శాఖ ప్రధానమైందన్నారు. మద్యం ఎగుమతి, దిగుమతిలో హమాలీలు కీలకమని చెప్పారు. హమాలీలకు ఇచ్చే రేట్లను పెంచుతామని అధికారులు గతంలో హామీ ఇచ్చారని కానీ ఇప్పటికీ హామీ అమలు చేయలేదన్నారు. అలానే ప్రమాదబీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. రేట్లు పెంచకపోతే మార్చి 4న జిల్లా వ్యాప్త నిరసన కార్యక్రమాన్ని చేపడతామన్నారు. కార్యక్రమంలో ఐఎంఎల్ బేవరేజ్ హమాలీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటసుబ్బారెడ్డి, యూనియన్ నాయకులు రఘురామయ్య, జి.రెడ్డి ప్రసాద్, ఎన్వీ సుబ్బారెడ్డి, ఎన్.సుబ్బారెడ్డి, పివి రమణ, పీఓ కొండారెడ్డి, ఎ.నరేష్, ఎస్.మదన్, ఎల్.మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

మహా శివరాత్రికి ప్రత్యేక బస్సులు

సిద్దవటం : మండలంలోని వంతాటిపల్లి గ్రామ సమీపంలో లంకమల అడవుల్లో వెలసిన శ్రీనిత్య పూజస్వామి కోనలో ఈ నెల 7వ తేదీ నుంచి జరిగే మహా శివరాత్రి ఉత్సవాలకు కడప ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతామని కడప ఆర్టీసీ డిపో మేనేజర్ కె. దిలేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మంగళవారం సిద్దవటం గ్రామ శివారులో ఉన్న ఈద్గా మైదానాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భాకరాపేట, పంచలింగాల వద్ద ఆర్టీసీ కంట్రోల్ పాయింట్లను ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ సీఐ కన్యాకుమారి, ఏడీసీ ఫకృద్దీన్, కె.వి. మల్లికార్జునరావు, ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ సెక్రెటరీ బాలవెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

'పాఠ్యాంశంలో దళిత నాయకుడిగా అంబేడ్కర్'

- సవరించాలని డిమాండ్ చేసిన బీటీఏ నాయకులు



మాట్లాడుతున్న బహుజన ఉపాధ్యాయ నాయకులు

కడప ఎడ్యుకేషన్ : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను పాఠ్యాంశాలలో దళిత నాయకుడిగా ముద్రించారని దానిని వెంటనే తొలగించాలని బీటీఏ కడప జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి జ్యోతి రామచంద్ర, డాక్టర్ హరికొండయ్యలు డిమాండ్ చేశారు. ప్రస్తుతం జరుగుతున్న ఎఫ్ఏ పరీక్షల్లో సోషల్ ప్రశ్నాపత్రంలో దళిత ఉద్యమ నాయకుడు ఎవరు అనే ప్రశ్న వచ్చిందని దానికి జవాబుగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌గా రూపొందించారన్నారు. దీనిని తీవ్రంగా వ్యతిరేకిస్తునాన్నారు. ప్రపంచ మేధావి, ఆర్థికవేత్త, న్యాయ కోవిధుడు, నవభారత రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేడ్కర్ విగ్రహాలను ఇతర దేశాలు స్వచ్ఛందంగా ఏర్పాటు చేసుకున్నారన్నారు. ఐక్యరాజ్య సమితి అంబేడ్కర్ జన్మించిన ఏప్రిల్ 14ను జ్ఞాన దినోత్సవంగా ప్రకటించిందన్నారు. అలాంటి వ్యక్తిని దళిత నాయకుడిగా ముద్రవేసి పిల్లల మెదడులో చొప్పించడాన్ని ఖండిస్తున్నామన్నారు. పాఠ్యాంశాల్లో దళిత నాయకుడిగా ముద్రించడాన్ని తొలగించాలన్నారు. కార్యక్రమంలో బీటీఏ నాయకులు రామాంజనేయులు, మధుసూదన్, పెంచలయ్య, రమణ పాల్గొన్నారు.

అంధుల పాఠశాలలో సైన్స్ ఫెయిర్



ప్రదర్శించిన నమూనాలతో విద్యార్థులు

కడప ఎడ్యుకేషన్: శంకరాపురంలోని ప్రభుత్వ అంధుల పాఠశాలలో మంగళవారం జాతీయ విజ్ఞాన దినోత్సవాన్ని పురస్కరించుకుని సైన్స్ ఫెయిర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇన్‌చార్జు హెచ్‌ఎం, సైన్సు టీచర్ వేపరాల ఎబినేజర్ సహాయ సహకారాలతో మొట్టమొదటి సారిగా సైన్స్ ఫెయిర్ కార్యక్రమంలో అంధ విద్యార్థులు తమదైన శైలిలో ప్రాజెక్టులను సిద్ధం చేశారు. స్కూల్ పేరెంట్ కమిటీ చైర్మన్ దండు వెంకటసుబ్బారెడ్డి కుమారుడు 8వ తరగతి విద్యార్థి దండు శర్వానందరెడ్డి గాలి కిటికీలు సంజీవనీలు అన్న ప్రయోగం సందర్శకుల ఆలోచింపజేసింది. అలానే 8వ తరగతి విద్యార్థి కరుణాకర్ సింపుల్ సర్క్యూట్ సహాయంతో నీరు, కరెంట్ వృథా కాకుండా ఆ రెండు వనరులను ఆదా చేయడంపై ప్రయోగాన్ని చేసి అందరిని ఆకట్టుకున్నారు. అలాగే ప్రవీణ్‌కుమార్‌రెడ్డి అనే విద్యార్థి ఓడలు నదుల్లో మునుగుతాయని సముద్రాల్లో తేలుతాయనే విషయాన్ని గ్లాసు, గుడ్డును ఉపయోగించి కళ్లకు కట్టినట్లు చూపించాడు. విద్యార్థులు ప్రదర్శనలను పలువురు అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సరస్వతి, మురళీ, శ్రీనివాసులు, పీడీ నరసింహులు, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

చేతిరాతకు పదను పెడదాం

సంబేపల్లె : విద్యార్థి కెరీర్‌లో మంచి చేతి రాత చాలా ముఖ్యమని చేతిరాత బాగుంటే మంచి మార్కులు వస్తాయని స్థానిక ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ దిలీప్ కుమార్ తెలిపారు. అందువల్ల చేతిరాతను మెరుగుపర్చుకునేందుకు కొన్ని చిట్కాలు పాటించాలని సూచించారు. ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు నెలరోజుల పాటు చేతిరాతపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు దిలీప్ కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన ఆయన మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని చేతిరాత నిపుణులు లక్ష్మీనరసింహ ఆధ్వర్యంలో చేతిరాతలో మెళుకవలు, అందంగా రాయడం, కాలిగ్రఫీలో శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోండి

రాజంపేట రూరల్ : ప్రజాస్వామ్యంపై విశ్వాసంతో ప్రలోభాలకు గురికాకుండా యువత ఓటు హక్కును వినియోగించుకోవాలని విశ్రాంత జడ్జీ రామాంజనేయులు పిలుపునిచ్చారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం కడపకు చెందిన నెహ్రూ యువ కేంద్రం ప్రతినిధులు, నిఖిల రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఓటు హక్కు బాధ్యతగా ఉపయోగించుకోవాలని సూచించారు. అనంతరం కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వెంకటనరసయ్య, ఐసీటీసీ కౌన్సిలర్ వెంకటసుబ్బయ్య ఓటు హక్కు యొక్క ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముగిసిన విజయదుర్గ వార్షిక బ్రహ్మోత్సవాలు

- వైభవంగా ధ్వజావరోహణ ఉత్సవం
- రాహుకాల పూజల్లో పాల్గొన్న భక్తులు



సంతాన ప్రాప్తి కోసం కొడిముద్దల కోసం వేచివున్న మహిళలు

కడప కల్చరల్ : కడప నగరం బిల్టప్ వద్ద గల విజయదుర్గాదేవి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. అందులో భాగంగా ఆలయ వ్యవస్థాపకులు సుధా మల్లికార్జునరావు, నిర్వాహకులు దుర్గాప్రసాద్ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో బలిహరణం, యాగశాలలో చండీహోమం, పూర్ణాహుతి నిర్వహించారు. తర్వాత అవభృద స్నపనం, శిఖర ప్రోక్షణ నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాల మధ్య ఉత్సవాల ముగింపు సూచికంగా సింహ చిహ్నం గల పతాకాన్ని ధ్వజావరోహణం చేశారు. సంతాన ప్రాప్తి కోసం ధ్వజావరోహణం సందర్భంగా నిర్వాహకులు మహిళలకు కొడిముద్దలు పంపిణీ చేశారు. అమ్మవారి మూలమూర్తికి విశేష పూజలు నిర్వహించిన అనంతరం వేద పండితుల ఆధ్వర్యంలో ఆలయ నిర్వాహకులు దుర్గాప్రసాద్ అమ్మవారి త్రిశూలాన్ని ఆలయ ప్రాంణంలోని కోనేటి వద్దకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. భక్తుల జయజయ ధ్వానాల నడుమ ఆయన వేద పండితులతో కలిసి త్రిశూల స్నానం చేయించారు. కార్యక్రమంలో భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు. మంగళవారం కావడంతో రాహుకాల పూజలు జరిపారు. రాత్రి అమ్మవారికి రంగురంగుల పుష్పాలతో అభిషేకం చేశారు. వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించాలి



కేసులపై తల్లిదండ్రుల అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న జడ్జీ బాబా ఫకృద్దీన్

కడప అర్బన్: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఆ సంస్థ సెక్రటరీ, జడ్జీ ఎస్.బాబాఫకృద్దీన్ మంగళవారం ప్రభుత్వ బాలుర గృహాన్ని(జువెనైల్ హోం) పరిశీలించారు. అనంతరం న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జీ మాట్లాడుతూ పిల్లలకు అందుతున్న వసతి సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. బాలల సంరక్షణ కోసం స్నేహపూర్వక న్యాయసేవల పథకం 2015ను వివరించారు. పిల్లల పట్ల ఎప్పటికప్పుడు తగిన జాగ్రత్త వహించాలని సిబ్బందికి ఆదేశించారు. క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ బాలుర వసతి గృహం సూపరింటెండెంట్, పిల్లలు పాల్గొన్నారు.

చట్టాలపై పారా లీగల్ వలంటీర్లు అవగాహన పెంచుకోవాలి

రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ సూచనల మేరకు జిల్లా న్యాయసేవాధికార సంస్థ కడప వారి ఆధ్వర్యంలో న్యాయ సేవాసదన్‌లో మంగళవారం నూతనంగా నియమించబడిన పారా లీగల్ వలంటీర్‌లకు చట్టా లపట్ల శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జీ ఎస్. బాబా ఫకృద్దీన్ మాట్లాడుతూ శిక్షణ ఉద్దేశం పారా లీగల్ వలంటీర్ల పాత్ర, పారా లీగల్ వలంటీర్ల డ్రెస్ కోడ్, ప్రవర్తనా నియమావళి, నీతి న్యాయ సేవల అధికార చట్టం – 1987, నూతనంగా నియమించబడిన పారా లీగల్ వలంటీర్‌లను లీగల్ ఎయిడ్ క్లినిక్‌లలో నియమించడం జరుగుతుందన్నారు. ఈ క్లినిక్‌లలో పారా లీగల్ వలంటీర్లు విధులు నిర్వహిస్తూ ప్రజలు ఏవైనా అర్జీలు సమర్పిస్తే వాటిని లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాదులకు ఇవ్వాలన్నారు. వాటిని సెక్రటరీ, జడ్జీ పరిశీలించి తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జీ ఎం. ప్రదీప్‌కుమార్ మాట్లాడుతూ తల్లిదండ్రులు, సీనియర్ సిటిజన్‌ల నిర్వహణ సంక్షేమ చట్టం 2007, ప్రత్యామ్నాయ వివాద పరిష్కారం సెక్షన్ 89 సీపీసీలను వివరించారు. మాట్లాడుతూ రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులు విధులు, ఆర్టికల్స్ 14, 15, 16, 19, 21, 22 లను వివరించారు. కార్యక్రమంలో న్యాయవాదులు వి. శేషాద్రి, సుబ్రమణ్యం జె. ప్రభాకర్, చీఫ్ డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సభ్యులు ఎం.శాంత, ఎస్.హరిబాబుతోపాటు నూతనంగా నియమించబడిన పారా లీగల్ వలంటీర్‌లు పాల్గొన్నారు.

పిల్లల కేసులపై తల్లిదండ్రులు అవగాహన పెంచుకోవాలి

నగరంలోని ప్రభుత్వ బాలుర వసతి గృహంలో జడ్జీ ఎస్.బాబా ఫకృద్దీన్ ఆధ్వర్యంలో మంగళవారం పిల్లలపై వచ్చిన కేసుల విషయంలో వచ్చిన తల్లిదండ్రులు, వారి బంధువులకు తగిన సూచనలు చేశారు. చైల్డ్ వెల్ఫేర్ కమిటీ విధి విధానాలు మొదలైన అంశాలను వివరించారు. కార్యక్రమంలో మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జీ, జువెనైల్ జస్టిస్ బోర్డ్ జడ్జీ జె.నందిని, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీనివాసులు, జువెనైల్ జస్టిస్ బోర్డ్ మెంబర్ వరమ్మ, సుమిత్ర, వివిధ పోలీస్‌స్టేషన్‌ల చైల్డ్ వెల్ఫేర్ పోలీస్ అధికారులు, ప్రభుత్వ బాలుర వసతి గృహం సూపరింటెండెంట్, వైద్యాధికారి, పిల్లలు పాల్గొన్నారు.